64

# మొదటి ఆదివారము తరువాత: పునరుత్థాన పరిచర్య - 2

*“ఆయన శ్రమపడిన తరువాత, నలువది దినములవరకు వారి కగపడుచు, దేవుని రాజ్యవిషయములనుగూర్చి బోధించుచు, అనేక ప్రమాణములను చూపి వారికి తన్నుతాను సజీవునిగా కనుపరచుకొనెను” (అపొస్తలుల కార్యములు 1:3).*

*“నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపములనిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, లేఖనముల*

*ప్రకారము మూడవదినమున లేపబడెను, ఆయన కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెను. అటుపిమ్మట ఐదువందలకు ఎక్కువైన సహోదరులకు ఒక్క సమయమందే కనబడెను, వీరిలో అనేకులు ఇప్పటివరకు నిలిచియున్నారు, కొందరు నిద్రించిరి. తరువాత ఆయన యాకోబుకును, అటుతరువాత అపొస్తలుల కందరికిని కనబడెను. అందరికి కడపట, అకాలమందు పుట్టినట్టున్న నాకును కనబడెను" (1 కొరింథీయులకు 15:3-8).*

యేసు పునరుత్థానము మనము మన జీవిత ప్రయాణంలో ఎక్కడ ఉన్నామనుదానితో నిమిత్తము లేకుండా మనకు పరిచారము చేయును. ఎవరైనా నమ్మనట్లయితే, మనము నమ్మునట్లు పునరుత్థానము మనకు అవసరమైన నిదర్శనమును సమకూర్చును. ఎవరైనా ఇటీవలి కాలములో యేసు క్రీస్తును తన స్వరక్షకునిగా అంగీకరించిన క్రైస్తవుడైనట్లయితే, యేసు మరణమును జయించిన విజయము అతడు సరైన నిర్ణయము చేసికొన్నాడను అభయమును అనుగ్రహించును. ఎవరైనా క్రీస్తుతో కూడ నడుచుచు గడుపుచుండు జీవితం మార్గమధ్యలో ఉన్నట్లయితే, జీవితములో ఎదురయ్యే అత్యంత బలమైన శక్తులను గెలుపొందుటకు యేసు ఎలా శక్తి కలిగియున్నాడని అతడు అధ్యయనము చేయుచుండగా యింకా అభివృద్ధి చెందుచు పట్టుదలతో ముందుకు పయనించవలెనని ప్రోత్సాహింపబడును. ఒకరు వారి జీవిత అవసాన కాలమునకు చేరువలో ఉంటూ కాలధర్మము కొరకు కనిపెట్టుకొనియున్నట్లయితే, యేసే పునరుత్థానమును జీవమునై యున్నాడని పునరుత్థానము అతనిని ఒప్పించును.

మన లోతైన అవసరములకు తీర్చుటలో పునరుత్థానము విదితముచేయుచున్న విశ్వసనీయతను గమనిస్తూ, పునరుత్థాన చరితమును చక్కగా అనుసరిస్తూ మనము ముందుకు వెళ్ళుదము.

పునరుత్థానము మనకు అవసరమైన నిదర్శనమును అనుగ్రహించును. యేసు తోమాకు కనబడుట ఆయన పునరుత్థానుడైన తరువాతి ఆరవ ప్రత్యక్షతయై యున్నది.

*యేసు పునరుత్థానుడైన ఎనిమిది దినముల తరువాత, పునరుత్థాన దిన తరువాత ఆదివారంనాడు* శిష్యులు మరొక పర్యాయము కూడుకొన్నారు. అదివారం క్రీస్తును వెంబడించు వారికి ఒక విశిష్టమైన కూడిక దినమైయుండునని వారు వెంటనే గుర్తించారు. క్రైస్తవులకు గల దాని ప్రాముఖ్యతనుబట్టి, ఈ దినము "ప్రభువు దినము" అని ప్రసిద్ధికెక్కినది (ప్రకటన 1:10). దైవికమైన నేతృత్వములో, ఈ దినము క్రైస్తవులు ఒక చోట కూడుకొనుటకును ఆయన మరణమును స్మరించు నిమిత్తము యేసు ప్రతిష్ఠించిన ప్రభువు బల్లలో పాల్గొనుటకును ప్రత్యేకింపబడిన దినమైనది (అపొస్తలుల కార్యములను 20:7).

ఈ ఆదివారంనాడు, శిష్యులు యెరూషలేములో కూడుకొని యుండిరి ఈసారి తోమా వారితో కూడ ఉన్నాడు (యోహాను 20:26ఎ). ఆయన పునరుత్థానపు ఆదివారం సాయంకాలసమయ సభమధ్యలో యేసు ప్రత్యక్షమైనప్పుడు, తోమా వారితో కూడ ఉన్నాడు. బహుశ తోమా వారితో కూడ కొంచెము సేపుండి నిదానంగా అక్కడ నుండి నిష్క్రమించియుండవచ్చును. ఆ తరువాతి వారము రోజులన్నిటిలోను తోమా అందరూ అనుభవించుచుండిన ఆనందానుభూతిని తాను అనుభవించని విషయము గూర్చి తరుచుగా వినియుంటాడు. శిష్యులు ఆయనతో, "తోమా, మేము ప్రభువును చూశాము! నీవు వెళ్లిపోయిన కొద్దిసేపటికే ఆయన మాకగుపించాడు. నీవు ఒక్క క్షణం వేచియుండియుంటే, నీవు కూడ ఆయనను చూచియుందువు" అని చెప్పియుందురు. అప్పుడు తోమా, "నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి, నా వ్రేలు

ఆ మేకుల గురుతులో పెట్టి, నా చెయ్యి ఆయనకు ప్రక్కలో ఉంచితేనే గాని, నమ్మనే నమ్మను" అని ప్రతినిందగా ప్రత్యుత్తరమిచ్చాడు (యోహాను 20:25). బహుశ తోమా, మనమందరము చేయు విధంగానే కొంచెం అతిశయోక్తిగా అనియుండవచ్చును, కానీ ఆయన మనస్సులో మెదలుచుండిన మౌలిక ఆలోచన యథార్థమైనదే: "నేను రుజువును స్వయంగా నా కళ్లారా చూడాల్సిందే లేదంటే నేను నమ్మనే నమ్మను."

శిష్యులు తలుపులు మూయబడి యుండిన గదిలో కూడుకొని యుండగా, యేసు వారి మధ్యన అగుపించాడు, పునరుత్థానమైన ఆయన శరీరము భిన్నంగా ఉండినది. యేసు ఆయనకిష్టమైనప్పుడెల్లా తన దేహమును భౌతిక శరీరముగా చేసికోగలడు. గనుకనే ఆయన మూయబడి యుండిన తలుపులు తెరవబడకుండానే లోనికి ప్రవేశించాడు (యోహాను 20:26బి).

స్పష్టంగా, యేసు నేరుగా తోమా యొద్దకే వెళ్లాడు, చూశారా, ఎవరికైతే యేసు అత్యధికంగా అవసరమై యుండునో వారి యొద్దకు ఎల్లప్పుడూ వెళ్లునని మనము ఈ సందర్భములో సహితము గమనించుచున్నాము. తోమా తనలో తాను పెనుగులాడుచున్నాడు గనుక అతనికి ప్రత్యేకమైన సహాయం సమకూర్చబడవలసివచ్చింది. తోమా పలికిన మాటలను యెరిగిన మన ప్రభువు, అతనికొక చక్కని అవకాశమును కల్పించుచు, "నీ వ్రేలు ఇటు చాచి, నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి, అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుము" అని అతనితో చెప్పాడు (యోహాను 20:27).

కొన్ని సంవత్సరాల క్రితం, పునరుత్థాన ఆదివారం నాటికి ఒకటిరెండు రోజులకు ముందు, పునరుత్థానమును గూర్చిన ఒక వ్యాసము ఒక మతపరమైన వార్తా పత్రికలో ప్రచురింపబడింది. యేసు చేతిని మరియు ప్రక్కను అందుకొనవలెనని తోమా తన హస్తాన్ని చాచుచుండిన దృశ్యాన్ని చిత్రీకరిస్తూ సుప్రసిద్ధ చిత్రకారుని చేత గీయబడిన ఒక చిత్రలేఖనము ఆ వ్యాసము ముద్రింపబడిన పుటకు ఎదురు పుటలో ముద్రింపబడింది. ఏదిఏమైనా, తోమా ఆయన చేతులను ప్రక్కను తాకి చూడుమని యేసు అతనికిచ్చిన ఆహ్వానమును తోమా వాస్తవంగా అంగీకరించాడని, లేఖనములు మనకు ఎక్కడా చెప్పడంలేదు. తోమా "నా ప్రభువా, నా దేవా!" అని అన్నాడని దేవుని వాక్యము మామూలుగా తెలియజెప్పుచున్నది (యోహాను 20:28). తోమాకు, యేసు మృతులలో నుండి లేచి సజీవుడైయున్నాడనియు, ఆయన దేవుని కుమారుడనియు, ప్రభువును దేవుడునై యున్నాడనియు ఇప్పుడు ఎటువంటి సందేహమైనను లేదు. ఈ నిరూపణమును తోమా తానే స్వయంగా నిదానించి చూశాడు! తోమాకు లభించిన భౌతికమును, స్పర్శవేద్యమైన నిదర్శనము లేకుండానే అనేకులు నమ్ముదురని యేసు అతనికి గుర్తుచేశాడు: "నీవు నన్ను చూచి నమ్మితివి, చూడక నమ్మినవారు ధన్యులు" అని చెప్పాడు (యోహాను 20:29; 1 పేతురు 1:8, 9 చూడుము).

*పునరుత్థానము మనకవసరమైయున్న మార్గదర్శకత్వము నిచ్చును.* అపొస్తలులు భోజనము చేయుటకు కూర్చుండినప్పుడు యేసు వారికి అగుపించాడు (మార్కు 16:14–18).

ఈ ప్రత్యక్షతను యేసు పునరుత్థానమునకు సంబంధించిన యావత్తు చరితమంతటిలోను చారిత్రక కాలక్రమానుగతంగా అమర్చుట అత్యంత కష్టమైన పనియై యున్నది. ఈ మాటలు యేసు తనను తాను తోమాకు బయలుపరచుకొనిన సందర్భములో పలికినవై యుండవచ్చును (యోహాను 20:26–29). ఈ కథాంగము ఎప్పుడు సంభవించినదో సత్యవేద గ్రంథము

స్పష్టంగా సూచించుట లేదు.

పదనొకండగురు శిష్యులు భోజనము చేయుటకు బల్ల యొద్ద కూర్చుండినప్పుడు యేసు వారికి అగుపించాడని మార్కు చెప్పుచున్నాడు (మార్కు 16:14ఎ). ఈ ప్రత్యక్షతకు మార్కు వ్రాయుచున్న ఉపోద్ఘతములోని ప్రత్యేక పదములు దీనిని కనీసము శిష్యులకు మాత్రమే ఉద్దేశింపబడిన ఒక ప్రత్యేక ప్రత్యక్షతగా దృష్టించుటకైనా కొంచెము అధికార ఆధారాన్ని సమకూర్చుచున్నవి.

యేసు పునరుత్థానుడైన తరువాత ఆయనను చూచినవారు తెలియజేసిన నివేదికలను విశ్వసించుటలో శిష్యులు మందకోడిగా నుండిన విషయమై యేసు వారిని మొదట గద్దించాడు: "తాను లేచిన తరువాత తన్ను చూచినవారి మాట నమ్మనందున వారి అపనమ్మిక నిమిత్తమును హృదయ కాఠిన్యము నిమిత్తమును వారిని గద్దించెను" (మార్కు 16:14బి). ఆయన మూడవ దినమున లేచునని శిష్యులకు యేసు తన వ్యక్తిగత వాఙ్మూలము నిచ్చాడు (మత్తయి 17:22, 23). గనుక పునరుత్థానమునకు మునుపే వారు దాని గూర్చిన నిశ్చితమైన నమ్మకముతో హామీ గలవారై యుండవలసి యుండినది, కానీ యేసు పునరుత్థానుడయ్యాడని వారికి తెలియజెప్పబడిన యథార్థ నివేదికలను సహితము నమ్ముటకు వారు సంశయాత్మకమైనవారై యుండిరి.

రెండవదిగా, యేసు వారికి తన ఆదేశమును గూర్చి ఒక సంక్షిప్తమైన అనువాదము నిచ్చాడు: "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" (మార్కు 16:15). యేసు జీవితము, మరణము, మరియు పునరుత్థానము ద్వారా దేవుని సంకల్పము నెరవేరుటకు సమయము సమీపించుచుండినది: రక్షణ గూర్చిన శుభ వార్త సకల మానవులకు బోధింపబడుట.

మూడవదిగా, ఆయన, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" అని వారితో చెప్పాడు (మార్కు 16:16). రక్షణ అనుగ్రహింపబడు షరతులను కూడ ఆయన సారాంశంగా తెలియజెప్పాడు. రక్షణ (మనఃపరివర్తనము మరియు యేసును ఒప్పుకొనుటతో కూడిన)[1] విశ్వాసము మరియు బాప్తిస్మము అను షరతులతో కూడినదై యున్నదని ఆయన మాటలు పొరబడరాని విధంగా తెలియజెప్పుచున్నవి.

నాల్గవదిగా, అపొస్తలులు ఆయన ఆదేశమును అమలుపరచుచుండగా ఆయన సన్నిధి, కాపుదల, మరియు అధికారము వారితో కూడ ఉండునని ఆయన వారికి అభయమిచ్చాడు: "నమ్మినవారివలన ఈ సూచక క్రియలు కనబడును; ఏవనగా నా నామమున దయ్యములను వెళ్లగొట్టుదురు, క్రొత్త భాషలు మాటలాడుదురు; పాములను ఎత్తిపట్టుకొందురు, మరణ కరమైనదేది త్రాగినను, అది వారికి హాని చేయదు; రోగుల మీద చేతులుంచినప్పుడు, వారు స్వస్థత నొందుదురు" అని చెప్పాడు (మార్కు 16:17, 18). ఇది అపొస్తలులు మరియు ఎవరి మీదనైతే వారు చేతులుంచి పరిశుద్ధాత్మ వరములను అబ్బజేయుదురో వారు మాత్రమే ఆనందానుభూతిచెందు ఒక వాగ్దానమై యుండినది. మరణకరమైన విషయమును త్రాగుట మినహాయించి మిగిలిన వాగ్దానములన్నింటి నెరవేర్పు అపొస్తలుల కార్యముల గ్రంథంలో వ్రాయబడి యున్నది. దయ్యములను వెళ్లగొట్టుట గూర్చి అపొస్తలుల కార్యములు 16:16–18లో పేర్కొనబడింది; క్రొత్త భాషలతో మాటలాడుట అపొస్తలుల కార్యములు 19:6లో వ్రాయబడి యున్నది. మరణకరమైన పాము చేత కాటువేయబడిన

సంఘటన అపొస్తలుల కార్యములు 28:3–5లో కనబడును; మరియు ఒక కుంటివాడు స్వస్థపరచబడుట అపొస్తలుల కార్యములు 14:8–10 చెప్పుచున్నది. అపొస్తలుల కార్యముల గ్రంథం ప్రేరేపింపబడినవారి జీవితములలో సంభవించిన ప్రతి సంఘటనను వివరించుట లేదు. ఈ గ్రంథంలో కొందరు అపొస్తలుల ద్వారా జరిగిన కొన్ని కార్యములు మాత్రమే కలవు – ప్రధానంగా ఇద్దరు, పేతురు మరియు పౌలు. అది అపొస్తలులు చేసిన అన్ని కార్యములను తెలియజెప్పుటలేదు. మరణకరమైన విషము త్రాగినను మరణించరను వాగ్దాన నెరవేర్పును మనము విశ్వాసము చేతనే అంగీకరించుచున్నాము.

యేసు పునరుత్థానుడైన ఆదివారం సాయంకాలం ఇవ్వబడిన ఆదేశము యొక్క వృత్తాంతము తండ్రి ఇచ్చిన వాగ్దానము అపొస్తలుల త్వరలోనే ఇవ్వబడినను హామితో ముగిసింది (లూకా 24:48, 49). యేసు గలిలయలో ఉన్నప్పుడు కొండ మీద నుండి ఇచ్చిన ఆదేశము యొక్క వృత్తాంతములో, “ఇదిగో, నేను యుగసమాప్తి వరకు, సదాకాలము మీతో కూడ ఉన్నాను” అను వాగ్దానము కూడా ఉన్నది (మత్తయి 28:20బి). మహా ఆదేశము ప్రపంచమందలి నలు మూలలలో ఉన్న సమస్త మానవులకు వర్తిస్తుంది, సరికదా అది మానవ శక్తి ద్వారా మాత్రమే నెరవేరుటలేదని గ్రహింపనగుచున్నది. కాబట్టి మహా ఆదేశము గూర్చిన ప్రతి అంశముతో కూడ దానిని నెరవేర్చుటకు బయలుదేరు అపొస్తలులకైతేనేమి క్రైస్తవులకైతేనేమి ఒక ప్రత్యేక వాగ్దానము అనుబంధంగ ఉంటున్నది.

*పునరుత్థానము మనకు అవసరమైన క్రమశిక్షణను సమకూర్చును.* కొన్ని పర్యాయములు యేసు పునరుత్థానము తరువాతి నలువది దినముల వ్యవధిలో, ఆశాభంగము చేత అల్లల్లాడుచుండిన ఏడుగురు జాలరులకు ఆయన తిబెరియ సముద్రంలో అగుపించాడు (యోహాను 21:1–23).

యేసు మృతులలో నుండి లేచి సజీవుడైయున్నాడని పేతురు ఒప్పింపబడ్డాడు, కానీ దాని తరువాత అతడు ఏంచేయాలో అతనికి అర్థమవలేదు. తత్ఫలితంగా, అనేకమంది పురుషులు చేసే పనే అతడు చేశాడు. తన స్నేహితులలో కొందరిని పిలుచుకొని, “నేను చేపలు పట్ట బోదును” అని చెప్పాడు (యోహాను 21:3ఎ). అందుకు తోమా, నతనయేలు, యాకోబు, యోహాను మరియు ఇంకా ఇద్దరు ఇతర శిష్యులు, “మేమును నీతో కూడ వచ్చెదము” అని సంతోషంతో సమాధానమిచ్చారు. వారంతా కలిసి గలిలయ సముద్రము అని కూడ పిలువబడు తిబెరియ సముద్రంలోనికి, వారి పడవలతో వెళ్లి వలలు విసరుచు చేపలు పట్టుటకు మొదలు పెట్టారు.

వారు రాత్రంతా చేపలు పట్టారు కానీ ఏమియు దొరకలేదు. మనము చేపలు పట్టుటకు వెళ్లినప్పుడు ఎంత సేపు ప్రయత్నించినా ఒక్క చేపయైనను దొరకని పరిస్థితి మనలో అనేకులము ఎలా ఎదుర్కొంటామో వారిది కూడ ఆ నాటి రాత్రి అనుభవము అదే. తెల్లవారుచుండగా, తీరమున, దాదాపుగా వంద గజముల దూరంలో, ఎవరో ఒకరు నిలువబడి యుండి (యోహాను 21:4ఎ), వారికి వినబడేట్లుగా కేకవేస్తూ, “పిల్లలారా, భోజనమునకు మీ యొద్ద ఏమైన ఉన్నదా?” అని అడిగాడు (యోహాను 21:5). అందుకు వారు, “లేదు” అన్నారు. “దోనె కుడి ప్రక్కను వల వేయుడి మీకు దొరకును” అని తీరమున నిలువబడి యుండినవాడు ఆదేశించాడు (యోహాను 21:6ఎ). వారు పరిచయములేని ఆ పరదేశి చెప్పినట్లు చేశారు, విస్తారమైన చేపలు పట్టారు, వారందరూ కలిసి వలనులాగలేనంత విస్తారంగా చేపలు

పడినవి.

యోహాను, "ఆయన ప్రభువు సుమి" అని అన్నాడు (యోహాను 21:7ఎ). ఆయన ప్రభువని గ్రహించి, పేతురు, అందినంత వరకు ఏదో వస్త్రము ధరించి, సముద్రము లోనికి దూకి, వంద గజాలు ఈదుకుంటూ వచ్చి తీరము చేరుకున్నాడు. మిగిలిన శిష్యులు పడవలోనే ఉండిపోయి చేపలను ఒడ్డుకు చేర్చారు. వారు తీరమునకు చేరుకొన్నప్పుడు, వారు నూట ఏబడి మూడు పెద్ద చేపలు పట్టారనియు, అయినా కూడ వల ఏ ఒక్క చోటనైనను పిగుల లేదనియు కనుగొన్నారు (యోహాను 21:11బి, 12ఎ).

శిష్యులు దరికి చేరారో లేదో, అక్కడ యేసు నిప్పును సిద్ధం చేసి దాని మీద చేపలు రొట్టె వంటచేయబడు ఏర్పాటు చేశాడు (యోహాను 21:9). ఆయన వారితో, "రండి భోజనము చేయుడి" అని చెప్పాడు (యోహాను 21:12బి). పునరుత్థానుడైన క్రీస్తుతో కూడ కలిసి ప్రొద్దుటి అల్పాహారం ఆరగించు అనుభవాన్ని నీవూహించుకొనగలవా? శిష్యులు యేసుతో కలిసి భోజనం చేయుచుండగా, వారు యేసుతో కూడ భోంచేస్తున్నారని నమ్ముటకు వారికి ఎటువంటి సందేహమైనను లేదు. యేసు మృతులలోనుండి లేపబడిన తరువాత శిష్యులకు ప్రత్యక్షమగుట ఇది మూడవసారి అని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 21:14). ఒక గుంపుగా కూడుకొని యుండిన తన అపొస్తలులకు లేక శిష్యులకు ఆయన ప్రత్యక్షమైనది ఇది మూడవసారి, ఆయన పునరుత్థానుడైన అదే ఆదివారం సాయంకాలము ప్రత్యక్షమైనది, ఒకసారి (యోహాను 20:19-23). ఆయన పునరుత్థానుడైన తరువాతి మొదటి ఆదివారం నాడు ప్రత్యక్షమగుట (యోహాను 20:26-29) రెండవసారి.

ప్రొద్దుటి అల్పాహారం ఆరగించిన తదుపరి, యేసు మరియు పేతురు వ్యక్తిగతమైన మరియు ముక్కుసూటియైన సంభాషణ చేశారు. యేసు, "యోహాను కుమారుడవైన సీమోనూ, వీరి కంటే నీవు నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా?" [*agapao*] అని పేతురును అడిగాడు. అందుకు పేతురు, "అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించుచున్నానని [*phileo*] నీవే యెరుగుదువు" అని ప్రత్యుత్తరమిచ్చాడు. అప్పుడు యేసు, "నా గొఱ్ఱె పిల్లలను మేపుము" అని పేతురుతో చెప్పాడు (యోహాను 21:15).

ప్రేమ గూర్చి గ్రీకు భాష నాలుగు వెర్వేరు పదములను, ఒక్కొక్క దానిని ఒక నిర్థిష్టమైన అర్ధముతో ఉపయోగించుచున్నది. యేసు మరియు పేతురు మధ్య జరిగిన సంభాషణలో ఈ నాలుగింటిలోని రెండు పదములు ఉపయోగింపబడినవి. యేసు పేతురును అడిగిన ప్రశ్నలో గల ప్రేమను పేర్కొంటూ వాడబడిన పదము, అగపాఒ, అది అత్యున్నతమైన ప్రేమను అనగా మరొకరితో మనోభావవేశపూరితమైన సంబంధము ఉన్నదా లేదా అను అంశముతో నిమిత్తము లేకుండా అతని యెడల ఉత్తమమైనదానిని చేయుటకు కోరుకొను ప్రేమను, సూచించుచున్నది. అయితే యేసు అడిగిన ప్రశ్నకు ప్రత్యుత్తరమిస్తూ పేతురు ఉపయోగించిన ఫిలెఒ అను పదము, ఒక స్నేహితుడు వాని స్నేహితుని యెడల కలిగియుండి కనుపర్చునటువంటి ప్రేమను సూచించుచున్నది.

యేసు, "సీమోను కుమారుడవైన యోహానూ, నన్ను ప్రేమించుచున్నావా?" [*agapao*] అని పేతురును రెండవ మారు ప్రశ్నించాడు. అందుకు పేతురు, "అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించుచున్నానని [*phileo*] నీవే యెరుగుదువు" అని జవాబిచ్చాడు. అప్పుడు యేసు, "నా గొఱ్ఱెలను కాయుము" అని చెప్పాడు (యోహాను 21:16). ఇదే ప్రశ్నను యేసు

పేతురును మూడవసారి అడిగాడు, కానీ ఈసారి ఆయన అడిగిన ప్రశ్నలో ప్రేమ గూర్చి ఒక స్థాయి తగ్గుచూ [*phileo*] అను పదమును ఉపయోగించుచు, ఆయన యోహాను కుమారుడవైన సీమోనూ, "నన్ను ప్రేమించుచున్నావా?" అని అడిగాడు. మరల మరల అదే ప్రశ్న వేయబడినందుకు పేతురు కొంతవరకు చికాకు పడి, "ప్రభువా, నీవు సమస్తము ఎరిగినవాడవు; నిన్ను ప్రేమించుచున్నానని [*phileo*] నీవే యెరుగుదువు" అని చెప్పాడు. యేసు, "నా గొఱ్ఱెలను మేపుము" అని చెప్పాడు (యోహాను 21:17, 18ఎ).

గెత్సేమనే తోటలో మన ప్రభువు పట్టబడిన రాత్రి, "వీరు నిన్ను విడిచిపెట్టిపోవచ్చును, కానీ నేను మాత్రం నిన్ను విడిచిపెట్టి వెళ్లను. అందరు నిన్ను విడిచిపెట్టి వెళ్లుదురేమో, కానీ నేను మాత్రం నిన్ను ఎన్నడును వదలను" అని పేతురు ప్రభువుతో చెప్పాడు (మత్తయి 26:33 చూడుము). ఆ సమయంలో యేసు, "ఈ రాత్రి కోడి కూయక మునుపే నీవు నన్ను ఎరుగనని ముమ్మారు చెప్పెదవు" అంటూ పేతురును హెచ్చరించాడు (మత్తయి 26:34). అటుతరువాత, యేసునకు తీర్పు తీర్చబడుచుండగా, యేసును ఎరుగనని పేతురు ముమ్మారు బొంకాడు. బహుశ, పొద్దుటే అల్పాహారం ఆరగిస్తున్న సమయంలో జరిగిన సంభాషణ ద్వారా, అతిశయోక్తులు పలుకుటలో గల ఆపాయమును యేసు పేతురుకు గుర్తుచేయుచుండెను. పేతురు చేసిన తప్పుకు అదొక సున్నితమైన గద్దింపై యుండినది. పేతురు తన (గుణ) పాఠాన్ని నేర్చుకొన్నాడని వారి సంభాషణ ద్వారా స్పష్టమగుచున్నది. గనుక అతడు యేసు యెడల తనకున్న ప్రేమను వ్యక్తము చేయుటకు అత్యున్నతమైన ప్రేమను సూచించు అగపాఒ అను గ్రీకు పదమును ఉపయోగించుటకు సాహసించలేదు.

అతడు భవిష్యత్తులో ఆయనకు విశ్వసనీయుడుగా ఉండుననియు దేవునికి మహిమతెచ్చు మరణమును అనుభవించుననియు యేసు పేతురుకు సూచించాడు (యోహాను 21:18, 19). పొద్దుటి అల్పాహారమును ఆరగించుట ముగిసిన తరువాత యేసు లేచి, "నన్ను వెంబడించుము!" అని పేతురుతో చెప్పాడు. యోహాను కూడ వారి వెంట వెళ్లాడు. పేతురు వెనుకకు తిరిగి వారి వెంట వచ్చుచుండిన యోహానును చూస్తూ, "యోహాను సంగతేంటి? ఇతను ఎటువంటి చావు చస్తాడు?" అని యేసును అడిగాడు. అందుకు యేసు, "అతడు దీర్ఘాయుష్మంతుడుగా జీవించాలని నేను కోరుకొనుచున్నట్లయితే, ఆ సంగతంతా నేను చూసుకుంటాను, ఈ సంగతితో నీకెటువంటి సంబంధమూ లేదు" అన్నాడు (యోహాను 21:20-23 చూడుము).

*పునరుత్థానము మనకు అవసరమైన ప్రోత్సాహమునిచ్చును.* పునరుత్థానము తరువాత యేసు ప్రత్యక్షమగుచుండిన ఈ నలుబది దినముల వ్యవధిలోనే ఏదో ఒక నాడు, యేసు యాకోబునకు ప్రత్యక్షమయ్యాడు. "తరువాత ఆయన యాకోబుకును, అటుతరువాత అపొస్తలుల కందరికిని కనబడెను" అని పౌలు వ్రాయుచున్నాడు (1 కొరింథీయులకు 15:7).

ఈ యాకోబు ఏ యాకోబో మనకు తెలియదు. ఈ యాకోబు అపొస్తలుల కార్యములు 12:1, 2లో పేర్కొనబడినట్లు హతసాక్షిగా మరణించిన యాకోబై యుంటాడా? అపొస్తలత్వ హతసాక్షిగా మరణించినవారిలో అతడు మొదటివాడై యుండునట్లు అతనిని బలపర్చుటకు యేసు ప్రత్యక్షమయ్యింది ఈ యాకోబుకేనా?

ఈ యాకోబు, యేసు సహోదరుడైన యాకోబై యుండునా? యేసు తన పరిచర్యను

ప్రారంభించిన తొలి రోజుల్లో ఆయన సహోదరులు ఆయనయందు విశ్వసించలేదని మనకు తెలియజెప్పబడుచున్నది (యోహాను 7:5), కానీ అటుతరువాత చూస్తే యాకోబు "సంఘమునకు ఒక బలమైన స్తంభము"గాను (అపొస్తలుల కార్యములు 15:13 చూడుము) యాకోబు పత్రిక యొక్క గ్రంథకర్తగాను అగుపించుచున్నాడు. యేసు ఈ యాకోబుకు ప్రత్యక్షమై ఆది సంఘములో అతడు వహించనైయుండిన నాయకత్వ పాత్రకు తగినవానిగా సన్నాహము చేసియుండునా?

*మనము మన జీవితంలో కలిగియుండవలసిన ఉద్దేశమును పునరుత్థానము సమకూర్చును.* నిస్సందేహంగా యేసు గలిలయలోని కొండ మీద ఒక సమూహమునకు ప్రత్యక్షమయ్యాడు, అది ఆయన అపొస్తలులకును, పౌలు 1 కొరింథీయులకు పత్రికను వ్రాసినప్పుడు వారిలో అధిక సంఖ్యాకులు యింకను సజీవులై యుండిన, ఐదువందల కంటే ఎక్కువైన సహోదరులకును అగుపించిన ఒక ప్రత్యక్షత (మత్తయి 28:16–20; 1 కొరింథీయులకు 15:6).

"నేను లేచిన తరువాత మీకంటె ముందుగా గలిలయకు వెళ్లెదను" అని యేసు ఆయన మరణించక మునుపు వాగ్దానం చేశాడు (మత్తయి 26:32). "త్వరగా వెళ్లి, ఆయన మృతులలో నుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి; ఇదిగో ఆయన గలిలయలోనికి మీకు ముందుగా వెళ్లుచున్నాడు, అక్కడ మీరు ఆయనను చూతురు; ఇదిగో, మీతో చెప్పితిని" అని పునరుత్థాన దిన ఉదయమున సమాధిలో కూర్చుండియుండిన దేవదూతలు కూడ స్త్రీలకు చెప్పారు (మత్తయి 28:7). ఈ విధంగా, ప్రత్యక్షతల గూర్చిన ఈ వృత్తాంతమునకు మత్తయి తన ఉపోద్ఘాతమును వ్రాస్తూ, "పదనొకండుమంది శిష్యులు యేసు తమకు నిర్ణయించిన గలిలయలోని కొండకు వెళ్లిరి" అని వ్యాఖ్యానిస్తున్నాడు (మత్తయి 28:16),

యేసు కొండ మీద ఈ సముహమునకు ప్రత్యక్షమైనప్పుడు వారు ఆయనను ఆరాధించారు, కానీ వారిలో కొందరు అనుమానించారని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 28:17). బహుశ అక్కడ కూడుకొనియుండిన వారిలో కొందరు ఆయన పునరుత్థానుడైన తరువాత కొండ మీద ప్రత్యక్షము కాక మునుపు ఆయనను చూచియుండకపోచ్చును, గనుక ఇప్పుడు ఆయన అగుపించగానే వారు చూచుచుండినది నిజమో కాదో అని తేల్చుకోలేక ఆశ్చర్యానందముతో ముంచెత్తబడి యుండవచ్చును లేదా వారు ఆయనను స్పష్టంగా చూడలేనంతటి దూరంలో ఆయన ఉండినందువలన ఆయన నిజముగా యేసేనో కాదో అని వారు అనుమానించి యుందురు. యేసు వారికి దగ్గరగా వచ్చుచుండినప్పుడు, అక్కడ ఉండినవారందరును ఆయనయందు విశ్వాసముంచారు, గనుక పౌలు 1 కొరింథీయులకు 15:6లో ప్రభువు యొక్క పునరుత్థానము గూర్చిన సరియైన సాక్ష్యాధారాలు గల న్యాయసమ్మతము గూర్చి చేయుచున్న తన చర్చలో ఈ జనసమూహమంతటిని ఒక నిదర్శనంగా ఉపయోగించుకొనుచున్నాడు.

యేసు తన మహా ఆదేశము గూర్చి అతిగా సుపరిచితమైన కథనములో ఒక దానిని ఇచ్చినది ఈ సందర్భములోనే. ఆయన ఈ క్రింది విధంగా చెప్పాడు,

> పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులకు శిష్యులనుగా చేయుడి తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏ యే

సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను (మత్తయి 28:18-20).

ఆయనకు సర్వాధికారము దేవునిచేత ఇయ్యబడినదని యేసు ఘోషించాడు. వారు సమస్త జనులను శిష్యులనుగా లేక నేర్చుకొనువారిగా చేయవలెనని ఆయన వారికి ఆదేశములను జారీ చేశాడు. బోధింపబడినవారికి వారు బాప్తిస్మమియ్యవలెనని చెప్పాడు. క్రీస్తు నేర్పించిన విషయాలన్నింటిని బాప్తిస్మము పొందినవారు అనుసరించుచుండవలెనని వారికి నేర్పించుమని వారికి చెప్పాడు. వారు ఆయన ఆదేశము మేరకు పనులు చేయునప్పుడు ఆయన సన్నిధి వారితో కూడ సదాకాలముండునను అభయమిచ్చాడు. ఆయన బైబిల్ చరిత్ర యొక్క నూతన కాలమునకు, పెంతెకొస్తు దినము మొదలుకొని యుగాంతము వరకు నిలిచియుండు కాలమునకు ప్రారంభోత్సవము చేయుచుండెనని ఆయన మహా ఆదేశమును గూర్చిన ఈ వృత్తాంతము స్పష్టమైన భావప్రకాశకంగా సూచించుచున్నది.

*పునరుత్థానము మనకు సమాప్తిని సమాకూర్చును.* యేసు అపొస్తలులకు ఆయన ఆరోహణమైననాడు అగుపించుట నలుబది దినముల వ్యవధిలోని చివరి ప్రత్యక్షతయై యున్నది.

ఆయన ఆరోహణము మత్తయి లేదా యోహాను సువార్తలలో పేర్కొనబడలేదు, “ఈలాగు ప్రభువైన యేసు వారితో మాటలాడిన తరువాత, పరలోకమునకు చేర్చుకొనబడి, దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడయ్యెను. వారు బయలుదేరి వాక్యమంతట ప్రకటించిరి, ప్రభువు వారికి సహకారుడై యుండి, వెనువెంట జరుగుచువచ్చిన సూచక క్రియలవలన వాక్యమును స్థిరపరచుచుండెను” అని మార్కు వ్రాసిన సువార్తలో క్లుప్తంగా పేర్కొనబడింది (మార్కు 16:19, 20). “ఆయన బేతనియవరకు వారిని తీసికొనిపోయి చేతులెత్తి వారిని ఆశీర్వదించెను. వారిని ఆశీర్వదించుచుండగా ఆయన వారిలో నుండి ప్రత్యేకింపబడి పరలోకమునకు ఆరోహణుడాయెను. వారు ఆయనకు నమస్కారము చేసి మహా ఆనందముతో యెరూషలేమునకు తిరిగి వెళ్లిరి ...” అని లూకా కూడ బహు క్లుప్తంగా వివరించాడు (లూకా 24:50-52). ఏది ఏమైనా, అత్యంత విశదంగా గల వివరణము అపొస్తలుల కార్యములు 1:6-12లో కలదు.

ఆయన ఆరోహణమగుటకు కొంతసేపటి క్రితం, వారితో కూడ ఉండిన ఒక కూడికలో యేసు తన అపొస్తలులకు ఆయన ఆరోహణమైన వెంటనే గల భవిష్యత్తును గూర్చిన ఆదేశములను ఇచ్చాడు. మొదటిగా, వారు యెరూషలేము విడిచిపెట్టి వెళ్లకూడదని ఆయన వారికి ఆజ్ఞాపించాడు (అపొస్తలులు కార్యములు 1:4ఎ). రెండవది, రానున్న కొద్ది రోజుల్లో వారు ఆయన అదివరకే వారితో కూడ చర్చించిన తండ్రి వాగ్దానమును పొందుకొందురని వారికి సరియైన సమాచారమును అందజేసాడు (అపొస్తలులు కార్యములు 1:4బి), యోహాను నీళ్లతో బాప్తిస్మమిచ్చిన విధంగానే, వారు పరిశుద్ధాత్మతో బాప్తిస్మము ఇయ్యబడుదురని తెలియజెప్పాడు (అపొస్తలుల కార్యములు 1:5). వారు పొందుకొననై యుండిన ఈ బాప్తిస్మము యేసు చేతనే ఇయ్యబడునని స్పష్టమగుచున్నది (మత్తయి 3:11; లూకా 24:49).

ఆ తరువాత, ఆరోహణము కాబోవుచుండిన నాడు, శిష్యులు, “ప్రభువా, యి కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరలా అనుగ్రహించెదవా?” అని యేసునడిగారు (అపొస్తలులు

కార్యములు 1:6). బహుశ రాబోవుచుండిన రాజ్యము గూర్చి వారిలో యింకా సరైన అవగాహన ఏర్పడకపోయియుండవచ్చును, అది వెనకటి ఇశ్రాయేలు రాజ్యము వంటి ఒక లౌకికమైన భౌతిక రాజ్యమై యుంటుందని అనుకుంటూ ఉండవచ్చును. లేదా, యేసు స్థాపించనై యుండిన ఒక ఆధ్యాత్మిక ఇశ్రాయేలున్నట్లే, సాక్ష్యత్తు భౌతిక ఇశ్రాయేలు రాజ్యము ఏర్పడుటను రాజ్యమునకు సంబంధించిన ఒక నెరవేర్పుగా చూచియుండవచ్చును. శిష్యులడిగిన ప్రశ్నకు యేసయ్య సమాధానమిచ్చాడు కానీ "కాలములు" మరియు "సమయములు" వారి స్వాధీనమునకు కాదు గాని తండ్రి స్వాధీనమునకు చెందినవని చెప్పాడు. ఏదిఏమైనా, వారి మీదికి పరిశుద్ధాత్మ దిగి వచ్చినప్పుడు వారు శక్తిని పొందుకొందురని ఆయన వారికి బయలుపర్చాడు. పరిశుద్ధాత్మ చేత బాప్తిస్మము పొందిన దానికి ఫలితంగా శక్తి వారి మీదికి వచ్చినప్పుడు, వారు యేసు జీవితమును, పరిచర్యను, మరణమును, మరియు పునరుత్థానమును యెరూషలేములోను, యూదయ యందంతటను, సమరయలోను భూదిగంతముల వరకును ప్రకటించుచు ఆయనకు సాక్షులై యుందురు (అపొస్తలుల కార్యములు 1:7, 8).

ఆయన ఈ వివరములన్నిటిని, ఒలీవల కొండ యొద్ద వారికి తెలియజెప్పిన తరువాత (అపొస్తలుల కార్యములు 1:12 చూడుము), అపొస్తలులు చూచుచుండగానే ఆయన ఆకాశములోనికి కొనిపోబడ్డాడు. ఇంతలో మేఘమొకటి కమ్ముకొనినందువలన ఆయన వారి కన్నులకు కనబడలేదు. ఆయన మేఘారూఢుడై పరలోకమునకు వెళ్లినట్లుండిన దృశ్యమది తెల్లని వస్త్రములు ధరించుకొనిన ఇద్దరు మనుష్యులు, నిస్సందేహంగా దేవదూతలే, వారి ప్రక్కలో నిలిచియున్నారు, వారు, "గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు? మీయొద్దనుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చును" అని వారితో చెప్పారు (అపొస్తలుల కార్యములు 1:9–11).

ఈ చారిత్రాత్మక సంఘటన తరువాత, అపొస్తలులు యెరూషలేమునకు తిరిగి వచ్చారు, ఆక్కడ ఇతర శిష్యులు మేడ గదిలో వేచియుండిరి, అందరూ కలిసి, వారు యెరూషలేములో వేచియుండవలెనని యేసు వారికి ఆజ్ఞాపించినట్లుగానే వేచియున్నారు. వారు వేచియుండగా, శిష్యులంతా ఏకమనస్సుతో, ఎడతెగక ప్రార్థన చేయుటకు తమ్మునుతాము నిమగ్నము చేసికొన్నారు (అపొస్తలుల కార్యములు 1:12–14).

యేసు పునరుత్థానుడైన తరువాత ఆయన ప్రత్యక్షమైన విషయాల గూర్చి పరిశుద్ధాత్మ మనకు ఎందుకింత సవిస్తరంగా వివరించి చెప్పుచున్నాడు? కొన్ని ప్రత్యక్షతలు కొంతసేపు మాత్రమే అగుపించినవి మరియు అవి మనకు తెలిసినంతవరకు యేసు తన మహా ఆదేశమునిచ్చిన సందర్భములు కావు, ఉదాహరణగా ఆయన స్త్రీలకు, పేతురుకు మరియు యాకోబుకు కనబడుట. ఈ ప్రత్యక్షతలు జరిగినప్పుడు ఆయన మృతులలో నుండి లేచి సజీవుడైయున్నాడనుటకు తననుతాను బయలుపరచుకొనుట మినహాయించి, భూమిని బ్రద్దలుచేసేంతటి సంఘటన ఏదీ సంభవింపలేదు. అలాంటప్పుడు, ఈ ప్రత్యక్షతలు పేర్కొనబడుటకు గల హేతువేమైయుండును? యేసు నిజముగా మృతులలో నుండి లేచియున్నాడని మనకు తెలియజెప్పుటకు పరిశుద్ధాత్మ ఆశించుచున్నాడని చెప్పుట గాక ఇతరమైన ఏ కారణమును చెప్పగలము? యేసు ప్రత్యక్షతలలో కొన్ని సవిస్తరంగాను వ్యక్తమైనవిగాను ఉండినవి, ఉదాహరణగా ఆయన మగ్దలేనే మరియకు, ఎమ్మాయు

గ్రామమునకు వెళ్లుచుండిన ఇద్దరికి, ఆదివారంనాడు కూటమిగా కూడుకొని యుండినవారికి, ఆయన పునరుత్థానుడైన తరువాతి వారాంతములో కూటమిగా కూడుకొని యుండినవారికి, ఏడుగురు జాలరులకు, కొండమీద ఉండిన జనసమూహమునకు, మరియు ఆయన ఆరోహణమైన దినమున అపొస్తలులకు కనబడుట. అవి ఎందుకలా ఉండినవి? దీనికి సమాధానం ఒక్కటే: ఆయన పునరుత్థానము యొక్క వివరములు దాని సజీవ గాథ, దాని నాటకీయత మరియు ప్రభావమును నీవు తెలిసికొనవలెనని ఆయన ఆశిస్తున్నాడు. యేసు మృతులలో నుండి లేచిన వృత్తాంతమును క్రొత్త నిబంధన అతి స్పష్టంగాను ఖచ్చితమైన నిశ్చయతతోను వివరించుచున్నది.

నీవు ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరమునకు ఎన్నడైనా వెళ్లనట్లయితే, సిడ్నీ నగరమున్నదని నీవెలా తెలిసికొనగలవు? ఆ పట్టణమున్నదని దాని గూర్చిన సమాచారమునందించు విశ్వసనీయమైన లిఖితసాక్ష్యధారాల ద్వారా నీవు తెలిసికొన్నావని స్పష్టమగుచున్నది. అదే విధంగా, యేసు పునరుత్థానమును గూర్చిన వివరములు లోకములో సమాచారమునందించు అత్యంత విశ్వసనీయమైన సాక్ష్యాధారము, దేవుని గ్రంథము (బైబిల్) ద్వారా మనకివ్వబడి యున్నవి.

గ్రాహ్యమగు, స్పృశించదగు యేసు పునరుత్థానము మనకు అవసరమైనప్పుడు అవసరపడు నిదర్శనమును సమకూర్చును. బండమీద పునాది వేయబడి కట్టబడిన ఇంటి వలె మనము మన జీవితములను స్థిరంగా నిర్మించుకొనగలుగుటకు గట్టి పునాదిని సమకూర్చును. యేసు పునరుత్థానము గూర్చిన ఈ గొప్ప సందేశము మన మనస్సుల్లో మన జీవితాంతము వరకు నిలిచియుండునట్లు జాగ్రత్తపడుదము.

❖◆❖◆❖

*పునరుత్థానము యొక్క విశ్వసనీయత ప్రధానంగా పరిశుద్ధ సత్యవేదము యొక్క విశ్వసనీయతపై ఆధారపడి యున్నది. పరిశుద్ధ బైబిలు నమ్మకొనదగినది, పునరుత్థానమును వదిలించుకొనగోరువారు మొదట బైబిలు యొక్క నిజాయితీని మరియు సత్యవాదిత్వమును నిర్మూలించుట వారి యెదుట నున్న ఒకే ఒక మార్గమై యున్నది. పరిశుద్ధ సత్యవేదము దేవుని సత్యమని అంగీకరించు ప్రతివాదును యేసు పునరుత్థానమును అంగీకరించకుండా ఉండజాలడు.*

---

సూచన

[1]లూకా 24:46, 47; రోమీయులకు 10:10 చూడుము.